పోజంటే మహా యిష్టం!

తన చూపుడు వేలితో ఆమె చుబుకాన్ని పైకెత్తి - ఆమె కాటుక కళ్ళ మీద సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు.

"నాన్నా! నాన్నా! మరే!" అంటూ వచ్చాడు కొడుకు సుబ్బారావు.

మంజుల వేపు ఒకసారి ఇబ్బందిగా చూసి - పిల్లవాడ్ని దగ్గరకు తీసుకున్నాడు గోపాలం - "ఏం రా! తులసి ఏదీ?" అంటూ-

తులసి. గోపాలంకి వున్న ఇద్దరి సంతానంలోనూ పెద్దది. రెండో వాడు సుబ్బారావ్.

"తులసి శర్మగారింట్లో ఆడుకుంటున్నది నాన్నా!" అన్నాడు సుబ్బారావు.

అతన్ని ఒళ్ళోకి తీసుకుని ముద్దులాడేడు గోపాలం.

"నాన్నా!" అంటూ వచ్చింది తులసి.

గోపాలం బిస్కట్ల పాకెట్ మంజుల చేతికి అందించాడు.

మంజుల బిస్కెట్స్‌ని ఇద్దరికీ యిచ్చింది. బిస్కెట్స్ తీసుకొని పిల్లలు బయటకు వెళ్ళిపోయారు.

మంజులను దీక్షగా చూశాడు గోపాలం.

అందమైన ఆమె బుగ్గలలో పూర్వపు మెరుపు లేదు. చక్కటి ఆమె నయనాల క్రింద నల్లని వలయాలు ఏర్పడ్డయ్. ఆమెలో, పెళ్ళయిన క్రొత్తలో వున్న చలాకీతనం అసల్లేదు! దాని బదులు ఎక్కడిదో గంభీరత్వం వచ్చిపడింది.

"మంజూ! నాకిదేం నచ్చలేదు!" అన్నాడు గోపాలం వున్నట్టుండి.

"ఏది!" అడిగిందామె వులిక్కి పడుతూ.

"అదే! ముందిది చెప్పు! నీ కిప్పుడెన్నేళ్లు?"

"ఇంకా ముసలిదాన్ని కాలేదు లెండి. అయినా శ్రీవారికి అదేంఅనుమానం?" వస్తున్న నవ్వును - పంటి క్రింద నొక్కి పెడుతూ అన్నది మంజుల.

"అదికాదు - నీ కింకా సరిగ్గా పాతికేళ్ళు నిండలేదు - అయినా ఇద్దరు పిల్లల తల్లి వయ్యావు! నాకు యింకా ముప్ఫయి ఏళ్ళు రాలేదు. అప్పుడే...." ఆగాడు గోపాలం - ఆమె కళ్ళల్లోని పూర్వపు వెలుగును వెతుకుతూ.

"ఊఁ!" అన్నది మంజుల ఏమీ అర్థం కాక.

"నే చెప్పేది పూర్తిగాఅర్థం చేసుకో మంజూ! నువ్వు మరీ చిన్నదానివేం కాదు - పైగా

